సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 8 । డిసెంబర్ । 2023



మోక్షం లభించేనా?
ధరణి లోపాలతో ఇబ్బందులు పడుతున్న రైతులు కొత్త ప్రభుత్వంలో తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశిస్తున్నారు.
- 8లో ▸



సన్నాల సాగుకు మొగ్గు
మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో యాసంగిలో సన్న రకం వరి సాగు చేయడానికి రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
23.4 /19.3

వాతావరణం
ఉదయం నుంచి చలిగాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ చిరుజల్లులు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

నేడు ఇందూరుకు అయోధ్య శ్రీరాముడి అక్షింతలు

నిజామాబాద్ సిటీ: అయోధ్యలో శ్రీరాముడికి పూజలు చేసిన అక్షింతలు శుక్రవారం ఇందూరుకు రానున్నాయి. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఇందూర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగర శివారు బోర్గాం చౌరస్తాలో గల శ్రీరామ మందిరం వద్ద ఉదయం 10 గంటలకు స్వాగత కార్యక్రమం జరగనుంది. ఇక్కడి నుంచి గాజుల్‌పేట్ పెద్ద రాంమందిర్ వరకు బైక్ ర్యాలీ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

పండ్ల మొక్కలకు ప్రాధాన్యత ఇవ్వాలి



డిచ్‌పల్లి: గ్రామ నర్సరీల్లో ప్రజలకు ఉపయోగపడే పండ్ల మొక్కలను పెంచేందుకు ప్రాధాన్యతను ఇవ్వాలని డీఆర్‌డీవో చందర్ నాయక్ సూచించారు. మండలంలోని నడిపల్లి, నక్కలగుట్ట తండా గ్రామాల్లోని నర్సరీలను గురువారం ఆయన సందర్శించారు. ఒక్కో నర్సరీలో 10వేల మొక్కలు పెంచేందుకు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. నర్సరీల్లో మొక్కల పెంపకానికి బ్యాగ్ ఫిల్లింగ్ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. బ్యాగులు నింపే సమయంలో ఎర్రమట్టి, నల్లమట్టితో పాటు సేంద్రియ ఎరువును కలపాలన్నారు. సిద్ధం చేసిన బ్యాగులకు ప్రతిరోజు రెండుసార్లు నీరు పట్టాలన్నారు. ఉద్యోగులు, సిబ్బంది లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీవో సుధాకర్, పంచాయతీ కార్యదర్శులు నిట్టు కిషన్‌రావు, చంద్రకాంత్, మేట్ మహిపాల్ తదితరులు ఉన్నారు.

9 నుంచి ఓపెన్ డిగ్రీ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలను ఈనెల 9 నుంచి నిర్వహించనున్నట్లు కో–ఆర్డినేటర్ రంజిత గురువారం తెలిపారు. డిగ్రీ ఫస్టియర్ విద్యార్థులకు ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు, సెకండియర్ విద్యార్థులకు 16 నుంచి 21, థార్డ్ ఇయర్ విద్యార్థులకు ఈనెల 9 నుంచి 14 వరకు పరీక్షలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 7382929612 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

12లోగా పీజీ పరీక్ష ఫీజు చెల్లించాలి

తెయూ: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ రెగ్యులర్, సెమిస్టర్ పరీక్షల ఫీజును ఈ నెల 12వ తేదీ లోపు చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారిణి ఎం అరుణ గురువారం తెలిపారు. ఎంఏ, ఎంకామ్, ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం, ఐదు సంవత్సరాల ఏపీఈ, పీసీహెచ్, ఐఎంబీఏ కోర్సులకు సంబంధించి 3, 5, 7, 9వ సెమిస్టర్స్ రెగ్యులర్ పరీక్షలకు ఈ షెడ్యూల్ వర్తిస్తుందన్నారు. రూ.100 అపరాధ రుసుముతో ఈ నెల 15వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉందన్నారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్‌లో జిల్లాకు పతకాలు



నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో జిల్లాకు పతకాలు వచ్చినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు గడీల శ్రీరాములు, కార్యదర్శి మహిపాల్‌రెడ్డి తెలిపారు. నగరంలోని స్విమ్మింగ్‌పూల్ ఆవరణలో పతకాలు సాధించిన క్రీడాకారులను గురువారం అభినందించారు. ఈ నెల 4, 5వ తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాకారులు పాల్గొని పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. పతకాలు సాధించిన వారిలో తేజస్, హిందు, మాధవిశ్రీ, సీహెచ్ కీర్తన ఉన్నారు. శ్రీనివాస్, డాక్టర్ ఖైసర్, రాగిణి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్ : దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు దివ్యాంగుల జిల్లా సంక్షేమ అధికారి ఎం సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఉత్తమ ఉద్యోగి, సోషల్ వర్కర్, ఎన్‌జీవో, ఎంప్లాయర్, ఆక్సిబుల్ డిపార్ట్‌మెంట్, పర్సన్ విత్ డిజేబులిటీ ఇన్‌కల్చర్ యాక్టివిటీస్‌లో పురస్కారాలు అందించనున్నారు.

ఆర్మూర్ నుంచి ఆట షురూ..

- మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అరాచకాలపై కొత్త ప్రభుత్వం నజర్
- ప్రమాణస్వీకారం రోజే యాక్షన్ మొదలు పెట్టిన యంత్రాంగం
- ఆర్మూర్‌లో జీవన్‌రెడ్డి మాల్ రెంటల్, విద్యుత్ బకాయిలపై హెచ్చరికలు
- అధికారంలో ఉన్నప్పుడు విచ్చలవిడిగా వ్యవహరించిన మాజీ ఎమ్మెల్యే
- జీవన్‌రెడ్డి అక్రమాలపై గత రెండేళ్లుగా అక్షరయజ్ఞం చేసిన 'సాక్షి'

అధికారంలో ఉన్న సమయంలో అరాచకంగా వ్యవహరించాడని ఆరోపణలు ఎదుర్కొన్న మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి గడ్డు కాలం షురువైనట్లు సంకేతాలు వస్తున్నాయి. ఆర్మూర్‌లోని ఆర్టీసీ స్థలాన్ని లీజుకు తీసుకుని నిర్మించిన జీవన్‌రెడ్డి మాల్‌కు సంబంధించి రెంటల్ బకాయిల విషయమై ఆర్టీసీ అధికారులు నోటీసులు ఇచ్చారు. మూడు రోజుల్లోగా చెల్లించని పక్షంలో సీజ్ చేస్తామని అల్టిమేటం విడుదల చేశారు. ఇక బకాయిలను చెల్లించకపోవడంతో విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపేశారు.

ఆర్మూర్‌లోని ఆర్టీసీ స్థలాన్ని లీజుకు తీసుకొని నిర్మించిన జీవన్‌రెడ్డి మాల్ అండ్ మల్టిప్లెక్స్ భవనం



'సాక్షి' అక్షరయజ్ఞంలో భాగంగా ఇచ్చిన కథనాలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన మొదటి రోజే ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అరాచకాలపై కాంగ్రెస్ ప్రభుత్వ యంత్రాంగం పవర్‌ఫుల్ యాక్షన్ మొదలు పెట్టింది. రాజ్యానికి అతీతంగా విచ్చలవిడి ప్రవర్తనతో జీవన్‌రెడ్డి వ్యవహరించడం పట్ల ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలు తమ ఎమ్మెల్యే పేరు చెప్పుకునేందుకే ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొన్నారు. ఇలాంటి నేపథ్యంలో జీవన్‌రెడ్డి తమ ఇంటి మనిషని కేసీఆర్, కేటీఆర్, కవిత చెప్పుతూ రావడంతో అతని అరాచకాలు పెచ్చుమీరాయి. ఈ క్రమంలో కీలకమైన ప్రభుత్వ అధికారులు సైతం కన్నీళ్లు పెట్టుకున్న సందర్భాలు కోకొల్లలు. ఇరిగేషన్ డీఈ వెంకటరమణారావు జీవన్‌రెడ్డి వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడని, దళిత నాయకుడు తలారి సత్యంను జీవన్‌రెడ్డే టిప్పర్‌తో గుద్ది చంపించాడని ఆరోపణలు వెల్లువెత్తాయి.

■ జీవన్‌రెడ్డి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను తీవ్రంగా వేధించడంతో పాటు అసహ్యకరమైన అసభ్య పదజాలంతో దూషిస్తూ వచ్చాడు. చంపేస్తానంటూ బెదిరింపులు చేశాడు. టిప్పర్లతో గుద్ది చంపేస్తానంటూ ఫోన్లు చేసి బెదిరిస్తూ వచ్చాడు. ఈ క్రమంలో జీవన్‌రెడ్డి అనుచరులు లక్కంపల్లి మహేందర్, గోవు రంజిత్ బీఆర్‌ఎస్‌కే చెందిన లక్కంపల్లి ఉప సర్పంచ్‌ను, మాజీ సర్పంచ్‌ను హత్య చేసేందుకు బీహార్ గ్యాంగ్‌కు సుపారీ ఇచ్చినట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఇలాంటి అనుచరులందరినీ ప్రోత్సహించి, కేసులు నమోదు కాకుండా జీవన్‌రెడ్డి చేస్తూ వచ్చాడు. దీంతో అనుచరులు ఇష్టం వచ్చినట్లు రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తూ గంజాయి, డ్రగ్స్ దందా సైతం చేస్తూ వచ్చారు. చివరకు పాత్రికేయులపైనా హత్యాయత్నాలు జరిగాయి. కల్లెడ సర్పంచ్ లావణ్య భర్త ప్రసాద్‌గౌడ్‌పై తనను హత్య చేసేందుకు ప్రయత్నించడంటూ డ్రామా సృష్టించి జీవన్ రెడ్డి అక్రమ కేసు పెట్టించాడని, పైగా ప్రసాద్‌గౌడ్‌పై పీడీ చట్టం కింద వరుసగా కేసులు నమోదు చేయించాడని బాధిత వర్గాలు ఆరోపించాయి. లావణ్యపైనా కేసులు పెట్టి జైలుకు పంపడంతో తరువాత ఆమె ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఇక పోలింగ్ రోజు సైతం బూత్‌ల్లోకి వెళ్లిన జీవన్‌రెడ్డి అధికారులను బెదిరింపులకు గురి చేయడం, ఆయా అధికారుల పేర్లను డైరీలో రాసుకుంటానని చెప్పడం అతని ప్రవర్తనకు మరో నిదర్శనం. ఈ నేపథ్యంలో జీవన్‌రెడ్డి అరాచకాలపై గత రెండేళ్లుగా 'సాక్షి' అక్షరయజ్ఞం చేస్తూ వచ్చింది.

బెదిరింపుల ధోరణి

జీవన్‌రెడ్డి వ్యవహారశైలి, ప్రవర్తనపై ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలు తీవ్రంగా అసహ్యించుకుంటూ వచ్చారని తెలుస్తోంది. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో భూఆక్రమణలు చేయడం, అసభ్యకరమైన భాష వాడడం తదితర అంశాలపై ఓటర్లు నిశితంగా గమనిస్తూ వచ్చారు. ఈ క్రమంలో సమయం కోసం వేచి చూస్తూ వచ్చారు. ఓట్లు అడిగే విషయంలో సైతం జీవన్‌రెడ్డి బెదిరింపు ధోరణితోనే ప్రవర్తించాడని జనం చెప్పుకున్నారు. చివరకు కల్వకుంట్ల కవిత సైతం జీవన్‌రెడ్డిపై పోటీ చేయడమంటే మైసమ్మ ముందు మేకపోతును కట్టేసినట్లేనని విపరీత వ్యాఖ్యలు చేయడం గమనార్హం. వీటన్నింటిని ప్రజలు డైరీలో రాసుకున్న మాదిరిగా గుర్తు పెట్టుకుంటూ వచ్చారు. ఓటర్లకు తాయిలాలు, కుక్కర్లు, చీరలు, స్థానిక ప్రజాప్రతినిధులకు బంగారం, నగదు ఇవ్వజూపినప్పటికీ తీర్పునిచ్చే విషయంలో మాత్రం విజ్ఞతతో వ్యవహరించారు. విపరీతంగా విర్రవీగిన జీవన్‌రెడ్డిని ఓటర్లు చాలా తక్కువ ఓట్లకే పరిమితం చేసి మూడో స్థానానికి విసిరేశారు.

ఆర్టీసీ, విద్యుత్ అధికారుల చర్యలు

బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో జీవన్‌రెడ్డి అధికారులను సక్రమంగా విధులు నిర్వహించకుండా అక్రమ వ్యవహారాలు చక్కబెట్టాలని బెదిరింపులకు గురి చేశాడని ఆరోపణలు ఉన్నాయి. అయితే ప్రభుత్వం మారడంతో అధికార యంత్రాంగం తమ పనిని షురూ చేసింది. ఆర్మూర్ పట్టణంలోని ఆర్టీసీ స్థలంలోని జీవన్‌రెడ్డి మాల్‌కు సంబంధించి రూ.7,23,71,807 రెంటల్ బకాయిల విషయమై ఆర్టీసీ అధికారులు నోటీసులు ఇచ్చారు. మూడు రోజుల్లోగా ఖాళీ చేయాలని హెచ్చరికలు జారీ చేశారు. లేనిపక్షంలో సీజ్ చేస్తామని అల్టిమేటం విడుదల చేశారు. ఇక రూ.2,57,20,002 విద్యుత్ బకాయిలను చెల్లించకపోవడంతో విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపేశారు. ఆర్మూర్ నుంచే రాష్ట్ర ప్రభుత్వం ఆట మొదలు పెట్టడం చూస్తుంటే జీవన్‌రెడ్డి ప్రజాప్రతినిధిగా వ్యవహరించిన తీరేమిటో అర్థం చేసుకోవచ్చు.



బకాయిల వసూలు కోసం 'మాల్'కు వచ్చిన ఆర్టీసీ ఆర్ఎం, పోలీసు శాఖ అధికారులు



మాల్‌కు విద్యుత్ సరఫరా నిలిపి వేయిస్తున్న ట్రాన్స్‌కో ఏడీఈ శ్రీధర్



ఎల్‌బీ స్టేడియం వద్ద నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డితో డిచ్‌పల్లి మండల నాయకులు

కాంగ్రెస్ శ్రేణుల పవర్ జోష్

- సీఎం రేవంత్ ప్రమాణస్వీకారానికి రాజధానికి తరలివెళ్లిన శ్రేణులు
- పదేళ్ల తరువాత అధికారం రావడంతో కాంగ్రెస్ కార్యకర్తల్లో ఉత్సాహం
- తొలివిడతలో మంత్రి పదవి దక్కకపోవడంతో ఉత్కంఠ
- సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, మహేశ్‌కుమార్‌గౌడ్‌లకు బాధ్యతలపై ఎదురుచూపులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి పదేళ్ల తరువాత అధికారం దక్కడంతో ఆ పార్టీ శ్రేణుల్లో పవర్ జోష్ ఉరకలేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారానికి గురువారం ఉమ్మడి జిల్లాకు చెందిన కార్యకర్తలు, నాయకులు భారీగా రాజధానికి తరలివెళ్లారు. జిల్లాలోని తొమ్మిది నియోజకవర్గాలకు చెందిన ఏ నాయకుడిని అడిగినా హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియానికి వెళ్లినట్లు చెప్పడం గమనార్హం. పార్టీలో గత 30 ఏళ్ల నుంచి పనిచేస్తున్న నాయకులకైతే వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. జిల్లాలో పార్టీ మూడోస్థానానికి పడిపోయిన దశలో రేవంత్‌రెడ్డి పాదయాత్ర ద్వారానే పూర్వవైభవం వచ్చిందని, ఈ క్రమంలో రేవంత్‌రెడ్డే ముఖ్యమంత్రి కావడంతో నాయకులు, కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో ఉన్నారు. అయితే ఉమ్మడి జిల్లా నుంచి కేబినెట్‌లో స్థానం దక్కకపోవడంతో నాయకులు, కార్యకర్తల్లో ఉత్కంఠ మాత్రం అలాగే ఉంది.

మలి విడతలో సుదర్శన్‌రెడ్డి..

ఉమ్మడి జిల్లా నుంచి మాజీ మంత్రి, సీనియర్ నేత, పీసీసీ కోశాధికారి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి కేబినెట్‌లో అవకాశం కల్పించనున్నట్లు చర్చ నడుస్తోంది. అయితే తొలి దశలో దక్కకపోవడంతో విస్తరణలో సుదర్శన్‌రెడ్డికి కచ్చితంగా అవకాశం దక్కనున్నట్లు తెలుస్తోంది. నిజామాబాద్ అర్బన్ టిక్కెట్టును షబ్బీర్ అలీ కోసం త్యాగం చేసిన పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి ఇచ్చేలా ఏఐసీసీ నాయకత్వం గతంలోనే హామీ ఇచ్చింది. మరోవైపు షబ్బీర్ అలీ రేవంత్ కోసం కామారెడ్డి వదిలి నిజామాబాద్ అర్బన్‌కు వచ్చారు. ఆయన ఓటమిపాలవడంతో ఎమ్మెల్సీ ఇచ్చి కేబినెట్ బెర్త్ కేటాయిస్తారనే చర్చ సైతం నడుస్తోంది. మైనారిటీ కోటాలో ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఇలా కాకపోతే షబ్బీర్ అలీ లేదా మహేశ్‌కుమార్‌గౌడ్‌లలో ఒకరికి పీసీసీ అధ్యక్ష పదవి సైతం ఇచ్చే ఆలోచన అధిష్టానం చేస్తున్నట్లు సమాచారం. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఉమ్మడి జిల్లాకు రెండు కేబినెట్ బెర్తులతో పాటు పీసీసీ అధ్యక్ష పదవి సైతం దక్కుతాయి. ప్రస్తుతం కేబినెట్‌లో ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాలకు మాత్రమే చోటు దక్కలేదు. రంగారెడ్డి జిల్లాకు స్పీకర్ పదవి కేటాయించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు కేబినెట్ స్థానాలతో పాటు పార్టీ కీలక పదవులు సైతం దక్కనున్నట్లు చర్చ జరుగుతోంది.

పంట నష్టం 714 ఎకరాలు

- వడగళ్ల వానకు దెబ్బతిన్న పత్తి, చెరుకు, మక్క
- ప్రభుత్వానికి నివేదించిన వ్యవసాయ శాఖ

డొంకేశ్వర్ : గత నెల 28న కురిసిన భారీ వడగళ్ల వర్షానికి జిల్లాలోని పంటలకు భారీగా నష్టం వాటిల్లింది. వడగళ్లకు తోడుగా గాలి కూడా తోడవంతో నిజామాబాద్ రూరల్, బోధన్, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో పంటలు నేలకొరిగాయి. ప్రధానంగా డిచ్‌పల్లి, నిజామాబాద్ సౌత్, ఎడపల్లి, రెంజల్, మోపాల్ మండలాల్లో పత్తి, మక్క, చెరుకు పంటలకు భారీ నష్టం జరిగింది. వరి స్వల్పంగా దెబ్బతిన్నది. వడగళ్ల వర్షానికి జిల్లా వ్యాప్తంగా 714 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ అధికారులకు ప్రభుత్వానికి నివేదించారు.

దెబ్బతిన్న పంటల వివరాలు

పంట	ఎకరాలు	పంట	ఎకరాలు
పత్తి	490.3	చెరుకు	89.0
మక్క	120.0	వరి	15.0

ఐదు మండలాల్లోని 16 గ్రామాల్లో 362 మంది బాధిత రైతులు ఉన్నట్లు అధికారులు తేల్చారు. అత్యధికంగా డిచ్‌పల్లి మండలంలో 486.33 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మోపాల్‌లో 128 ఎకరాలు, ఎడపల్లిలో 45, రెంజల్‌లో 48.22 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగింది. పత్తి పంట ఎక్కువగా నష్టపోవడంతో బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం నష్టం పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

ముగిసిన ధాన్యం కొనుగోళ్లు

- 4.10 లక్షల మెట్రిక్ టన్నులు సేకరణ
- సగానికి పడిపోయిన లక్ష్యం
- మంచి ధర రావడంతో వ్యాపారులకు విక్రయించిన అన్నదాతలు

సుభాష్‌నగర్ : జిల్లాలో యాసంగి సీజన్‌లో ధాన్యం సేకరణ ప్రశాంతంగా ముగిసింది. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేపట్టారు. జిల్లావ్యాప్తంగా 440 కొనుగోలు కేంద్రాల ద్వారా 4.10లక్షల మెట్రిక్ టన్నులు సేకరించారు. జిల్లా అధికార యంత్రాంగం 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కానీ లక్ష్యం సగానికి మించలేదు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకముందే బహిరంగ మార్కెట్‌లో మంచి ధర రావడంతో రైతులు ధాన్యాన్ని వ్యాపారులకు విక్రయించారు.

4.20 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో 4.20 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. సుమారు 10లక్షల మెట్రిక్ టన్నులకుపైనే ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. అందులో స్థానిక అవసరాలకు పోను మిగిలిన 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని అధికార యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. అందుకోసం అదనపు కలెక్టర్ యాదిరెడ్డి ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు పూర్తిచేశారు. ధాన్యం రవాణా, గన్నీ బ్యాగులు, రైస్‌మిల్లుల కేటాయింపు, తదితర రైతులకు ఇబ్బందులు ఎదురుకాకుండా అన్ని రకాల చర్యలు చేపట్టారు.

ఇతర జిల్లాలకు తరలింపు

బహిరంగ మార్కెట్‌లో ధాన్యానికి గిట్టుబాటు ధర పలకడంతో రైతులు వ్యాపారులకు విక్రయించారు. సుమారు 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నల్గొండ, హైదరాబాద్‌తోపాటు జిల్లాలోని పలువురు రైస్ మిల్లర్లు, దళారులు కొనుగోలు చేశారు. దొడ్డురకం క్వింటాలుకు రూ.2200 నుంచి రూ.2300 వరకు, సన్నరకం క్వింటాలుకు రూ.2600 వరకు ధర పలికింది. దీంతో 8 లక్షల మెట్రిక్ టన్నులు లక్ష్యంగా పెట్టుకోగా, బహిరంగ మార్కెట్‌కు ధాన్యం తరలిపోవడంతో కొనుగోలు కేంద్రాల ద్వారా కేవలం 4.10లక్షల మెట్రిక్ టన్నులను మాత్రమే సేకరించారు. 63,133 మంది రైతులు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకొచ్చారు. ధాన్యం లేకపోవడంతో కొనుగోలు కేంద్రాలు మూసేశారు. 55,732 మంది రైతులకు సంబంధించిన రూ.810 కోట్ల ధాన్యం డబ్బులు వారి ఖాతాల్లో జమచేశారు.

అందరి సహకారంతో..

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు అందరి సహకారంతో ప్రశాంతంగా పూర్తయ్యాయి. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అదనపు కలెక్టర్ యాదిరెడ్డి ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాం. కొనుగోలు కేంద్రాల్లో రైతులు అసౌకర్యాలకు గురి కాకుండా చర్యలు తీసుకున్నాం. ధాన్యం డబ్బులు ఎప్పటికప్పుడు రైతుల ఖాతాల్లో జమ చేశాం. కొనుగోళ్లు ప్రశాంతంగా ముగిసేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు.
– జగదీశ్‌కుమార్, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల సంస్థ

16 మంది విద్యార్థులకు అస్వస్థత

- బోర్గాం(పి) ప్రైమరీ పాఠశాలలో ఘటన
- ఫుడ్ పాయిజనే కారణమా?



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులు

మోపాల్ : నగర శివారులోని బోర్గాం(పి) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. గురువారం మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత 20 మంది విద్యార్థులకు కడుపు నొప్పితో పాటు వాంతులు అయ్యాయి. పాఠశాలలోనే మెడికల్ ఆఫీసర్లు ప్రాథమిక చికిత్స అందించగా, మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న ఎంఈవో రామారావు పాఠశాలను సందర్శించి హెచ్ఎం ధనలక్ష్మి వద్ద వివరాలు తెలుసుకున్నారు. పూర్తిస్థాయి నివేదికను జిల్లా విద్యాశాఖ అధికారులకు అందించారు. బోర్గాం(పి) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మొత్తం 141 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారికి మెనూ ప్రకారం అన్నం, పప్పు, సొరకాయతో మధ్యాహ్న భోజనం వడ్డించారు. మొదట కొంతమంది విద్యార్థులకు కడుపు నొప్పి రావడంతో ఉపాధ్యాయులు వైద్యులను పిలిపించి మందులు వేశారు. ఆ తర్వాత వివిధ తరగతులకు చెందిన మరికొందరికి కడుపు నొప్పితోపాటు వాంతులయ్యాయి. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని ఒకింత ఆందోళనకు గురయ్యారు. తమ పిల్లలు ఫుడ్ పాయిజన్‌కు గురయ్యారని తల్లిదండ్రులు అనుమానం వ్యక్తంచేశారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను అంబులెన్సులో జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థులకు చికిత్స అందిస్తున్నామని ఎంఈవో రామారావు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం ప్రస్తుతం మెరుగ్గానే ఉందన్నారు. కాగా ఫుడ్ పాయిజన్ అయితే విద్యార్థులందరూ అస్వస్థతకు గురవుతారని, కొందరు మాత్రమే అస్వస్థతకు గురి కావడం పట్ల బయట తినుబండారాలు ఏమైనా తిన్నారా అనే కోణంలో విచారణ చేపడుతున్నారు. భోజనం, కూరగాయలు, తాగునీరు, వాటర్ ట్యాంకులోని నీటి శాంపిళ్లను ఫుడ్ సేఫ్టీ అధికారులు సేకరించారు.

జీజీహెచ్‌లో చికిత్స

ఖలీల్‌వాడి : బోర్గాం(పి) ప్రాథమిక పాఠశాల లో అస్వస్థతకు గురైన విద్యార్థులకు జిల్లా జనరల్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి మెరుగు పడుతుందని వైద్యులు తెలిపారు. విద్యార్థులను మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ పరామర్శించారు.

పరామర్శించిన ఎమ్మెల్యే



ఖలీల్‌వాడి : జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులను ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పరామర్శించారు. విద్యార్థులకు పురుగుల అన్నం పెడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీని రద్దు చేయాలని డీఈవో, అదనపు కలెక్టర్‌ను ఫోన్‌లో కోరారు. పెద్దోళ్ల గంగారెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, ఇల్లెందుల ప్రభాకర్, ఇప్పకాయల కిశోర్, హరీశ్, పవన్, భాస్కర్, ఆనంద్ ఉన్నారు.

స్వచ్ఛందంగా విరాళాలు అందించాలి

నిజామాబాద్ నాగారం : దేశ సరిహద్దుల్లో ప్రాణాలు సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహిస్తున్న సైనికుల కోసం జిల్లాలోని ప్రజలందరు స్వచ్ఛందంగా విరాళాలు అందించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ప్రాంతీయ సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ నుంచి చేపట్టిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. మాజీ సైనికులు, సైనికులు, వారి కుటుంబాల కోసం ఉద్దేశించిన సహాయ నిధికి విరాళం అందజేశారు. ఎన్‌సీసీ క్యాడెట్లు, ఆర్మీ అధికారులు, సిబ్బంది కలెక్టర్‌కు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, గౌరవ వందనం సమర్పించారు. సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ యాదిరెడ్డితో పాటు కలెక్టరేట్ లోని వివిధ శాఖల ఉద్యోగులు సైనిక సంక్షేమ నిధికి తమవంతుగా విరాళాలు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సైనికుల త్యాగాలను ప్రతి పౌరుడు గుర్తిస్తూ, వారి సేవల పట్ల గౌరవభావంతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ సైనిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి రమేష్, కెప్టెన్ బాబురావు, సుబేదార్ రామేశ్వర్, ఉద్యోగులు ఫహియోద్దీన్, బదాం గంగామోహన్, లక్ష్మణ్, ఉమేర్, మల్కిట్ సింగ్, ఎక్స్ సర్వీస్ మెన్ అసోసియేషన్ ప్రతినిధులు మోహన్, దివాకర్ రెడ్డి పాల్గొన్నారు. సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకుని టీఎంఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వీరేశం ఆధ్వర్యంలో సైనికులను సన్మానించారు.



సాయుధ దళాల దినోత్సవం సందర్భంగా ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

భూ సమస్యలకు మోక్షం లభించేనా?

- ధరణిలో లోపాలను సవరించని గత ప్రభుత్వం
- ఇబ్బందుల్లో రైతులు.. పట్టించుకోని యంత్రాగం
- నూతన ప్రభుత్వానికైనా రైతుల గోస పట్టేనా..?



మోర్తాడ్: ధరణి లోపాలతో జిల్లాలోని అనేక మంది రైతులు భూసమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ప్రభుత్వపరంగా వచ్చే లబ్ధిని వారు పొందలేకపోతున్నారు. కొత్త రెవెన్యూ చట్టం అమలు కాక ముందు పహాణీలలో పట్టాదారు కాలంతో పాటు కబ్జా కాలం ఉండేది. ఎవరైనా భూమిని కొనుగోలు చేసి సాగు చేసుకుంటే పట్టా మార్పిడి జరుగకపోయినా కబ్జా కాలంలో సంబంధిత రైతు పేరును నమోదు చేసేవారు. కొత్త రెవెన్యూ చట్టం అమలుతో కబ్జా కాలాన్ని ప్రభుత్వం తొలగించింది. క్షేత్ర స్థాయిలో ఉన్న భూమిని సదరు రైతు కబ్జాలో ఉన్నా ఆ కాలం లేకపోవడంతో రెవెన్యూ రికార్డుల్లో పట్టాదారులదే పైచేయిగా మారింది. కబ్జా కాలం తొలగింపుతో అనేక మంది రైతులు నష్టపోయారు. పట్టాదారు ఒక్కరి పేరు రికార్డులలో ఉండేసరికి వారు భూమి విక్రయించినా పట్టా మార్పిడి జరుగకపోవడంతో చిన్న సన్నకారు రైతులకు ముప్పు వాటిల్లేలా ఉంది. అనేక మంది చిన్న సన్నకారు రైతులు తమకు కొత్త పట్టా పాసు పుస్తకాలు చేతికి అందలేవని అందుకు కారణం భూ వివరాలను ఆన్‌లైన్ చేయడంలో లోపాలే ప్రధాన కారణమంటూ రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ధరణిలో ఆప్షన్‌లు ఇవ్వకపోవడంతో అధికారులు కూడా చేతులెత్తివేసే పరిస్థితి ఏర్పడింది. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన రేవంత్‌రెడ్డి వీలైనంత త్వరగా భూసమస్యలకు పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

ఇతని పేరు కొట్టె నారాయణ. ఏర్గట్ల మండల కేంద్రానికి చెందిన ఈ రైతుకు 242ఓ సర్వే నంబర్‌లో పదమూడున్నర గుంటలు, 326అబీ సర్వే నంబర్‌లో ఏడు గుంటల భూమి ఉంది. ఇందుకు సంబంధించి ఉమ్మడి రాష్ట్రంలో జారీ చేసిన పట్టాదారు పాసుపుస్తకం, టైటిల్ డీడ్‌లు ఉన్నాయి. అలాగే 2016 వరకు రాసి ఉంచిన మాన్యువల్ పహాణీలలోనూ నారాయణ పేరుపై భూవివరాలు నమోదయ్యాయి. కానీ 2018లో కొత్తగా డిజిటల్ పాస్‌పుస్తకాలను తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన డిజిటల్ పాస్‌పుస్తకంలో నారాయణకు బదులు ఇతరుల పేరుపై భూమి వివరాలు నమోదు చేసి ఉంది. 2017లో నాటి అధికారులు, సిబ్బంది అన్ని భూముల విస్తీర్ణం, సర్వే నంబర్లు, యజమానుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయగా నారాయణ వివరాలను సరిగా నమోదు చేయలేదు. దీంతో భూమిపై ఉన్న హక్కులు అధికారికంగా దక్కడం లేదు. బ్యాంకు రుణం, ప్రభుత్వం అందించే పంట పెట్టుబడి, రైతు బీమాకు దూరమయ్యాడు. ఇలా నారాయణ లాంటి అనేక మంది ధరణిలో ఏర్పడ్డ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను పరిష్కరించాలని బాధిత రైతులు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకోలేదు. ఇకనైనా బాధ్యతలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ధరణి పోర్టల్‌ను రద్దు చేసి రైతుల సమస్యలను పరిష్కరిస్తుందా లేదా అని వేచి చూడాల్సి ఉంది.


కొట్టె నారాయణ, ఏర్గట్ల

ఘనంగా అయ్యప్ప పడిపూజ


మద్నూర్‌లో సామూహిక పడిపూజ నిర్వహిస్తున్న స్వాములు

మద్నూర్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మద్నూర్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం రాత్రి సామూహిక మహా మండల పడి పూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బిచ్కుంద అర్చకులు దత్తు, గజానంద్, దినేశ్ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, మహా అభిషేకం చేపట్టారు. అనంతరం పదెనెట్టాంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారి శరణుఘోషతో మండల కేంద్రం మారుమ్రోగింది. గురుస్వాములు లక్ష్మణ్, సాయిలు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గురుస్వాములు, దాతలను సన్మానించారు. కార్యక్రమంలో స్వాములు, భక్తులు పాల్గొన్నారు.


పూజ చేస్తున్న స్వాములు


అయ్యప్పకు అభిషేకం చేస్తున్న దీక్షాపరులు


పడిపూజకు హాజరైన స్వాములు, గ్రామస్తులు

క్లుప్తంగా

9న రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు

రామారెడ్డి: ఉప్పల్‌వాయిలోని గురుకుల పాఠశాల, కళాశాలలో ఈ నెల 9 నుంచి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సత్యనారాయణ గురువారం తెలిపారు. క్రీడాకారులకు(బాలుర) అథ్లెటిక్స్, ఖోఖో, హ్యాండ్‌బాల్ తదితర పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో ఆయా పాఠశాలల నుంచి సుమారు వెయ్యి మంది క్రీడాకారులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్ మేనిఫెస్టోను అమలు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై ప్రజలు పెట్టుకున్న ఆశలను నెరవేర్చాలని రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గురువారం పేర్కొన్నారు. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా తొమ్మిదిన్నరేళ్లు కేసీఆర్ అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమపథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. కేసీఆర్ అమలు చేసిన ఈ పథకాలను, సంక్షేమాన్ని మరింత పెంచి అందిస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు ఆ పార్టీకి అధికారాన్ని అందించారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల ఆశలను నెరవేర్చాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అందిన మంచి, శాంతియుత పాలన రాష్ట్రంలో కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని మర్కల్ స్టేజీ వద్ద తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో కామర్స్ సబ్జెక్టు బోధించటానికి అర్హత, ఆసక్తి గల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాధిక గురువారం తెలిపారు. దరఖాస్తులను ఈనెల 8 కల్లా కళాశాలలో సమర్పించాలన్నారు.

పాఠశాల తనిఖీ



బాన్సువాడ రూరల్: కొత్తాబాది గ్రామ జెడ్పీ హైస్కూల్, ప్రైమరీ స్కూళ్లను గురువారం రాష్ట్ర పరిశీలకుడు సెంజీవ్ కుమార్ తనిఖీ చేశారు. విద్యార్థుల పఠన, రాత, అవగాహన సామర్థ్యాలను పరిశీలించారు. అలాగే కొత్తాబాది జెడ్పీ హైస్కూల్‌లో కొనసాగుతున్న తిర్మలాపూర్ కాంప్లెక్స్ పాఠశాలల సమావేశంలో పాల్గొన్నారు. విద్యార్థులకు జీవశాస్త్రం సబ్జెక్టును అర్థమయ్యేలా ఎలా బోధించాలో మెలకువలు చెప్పారు. కార్యక్రమంలో సీఆర్‌పీ రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సన్నాల సాగుకు మొగ్గు

- సూపర్ సీడ్ రకం ధాన్యం సాగుచేసేందుకు రైతుల ఉత్సాహం
- కొనుగోలు చేయడానికి వ్యాపారుల ఆసక్తి

మోర్తాడ్: జిల్లాలో రైతులు సన్నరకం వరిసాగుకు మొగ్గు చూపుతున్నారు. యాసంగిలో సన్నరకం సాగు చేసిన రైతుల వానాకాలంలో కూడా వాటినే సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో ఈ సీజన్‌లో 3.50లక్షలకు పైగా ఎకరాల్లో వరి సాగు చేసే అవకాశం ఉంది. ఆశించిన రీతిలో వర్షాలు కురవడంతో భూగర్భ జలాలకు ఎలాంటి ఇబ్బంది లేదు. బోరుబావులు, చెరువులు, ఎత్తిపోతల పథకాలకు సమృద్ధిగా నీటి లభ్యత ఉంది. వరి సాగుకు ఎలాంటి ఆటంకాలు లేకపోవడంతో ఈ సీజన్‌లో లక్ష్యానికి అనుగుణంగా వరి సాగు చేయడానికి రైతులు సమాయత్తం అవుతున్నారు. సాధారణ యాసంగి సీజన్‌లో రైతులు దొడ్డు రకాలనే సాగు చేస్తారు. సూపర్ సీడ్ రకానికి మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో ఈ రకం ధాన్యాన్ని సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. సూపర్ సీడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,600ల వరకు ధర లభిస్తుండడంతో రైతులు ఈ పంటవైపే మొగ్గు చూపుతున్నారు. ఇదిలా ఉండగా సాగయ్యే వరిలో 30 శాతం వరకు సన్న రకాలను సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. క్రాప్ బుకింగ్ పూర్తి చేస్తేనే ఏ రకం పంట ఎంత విస్తీర్ణంలో సాగవుతోందో చెప్పవచ్చని అధికారులు వెల్లడించారు. ఏది ఏమైనా దొడ్డు రకాలకు ప్రత్యామ్నాయంగా సన్న రకాలను రైతులు సాగు చేస్తుండడం అభినందనీయమని పేర్కొన్నారు.


సిద్ధం చేసిన విత్తన ధాన్యం

పసుపునకు మద్దతు దక్కేనా!

- జిల్లాలో 33 వేల ఎకరాల్లో పంట సాగు
- 15 రోజుల్లో ప్రారంభం కానున్న తవ్వకాలు
- ధరపై ఆశలు పెట్టుకున్న రైతులు

బాల్కొండ: పసుపు పంటకు ఈ ఏడాదైనా మద్దతు ధర దక్కుతుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధిక పెట్టుబడితో సాగు చేసే పసుపునకు ఆశించిన ధర రాక యేటా కర్షకులు నష్టపోతున్నారు. మద్దతు ధర, పసుపు బోర్డు కోసం ఏళ్లుగా ఉద్యమాలు చేపడుతునే ఉన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇటీవల పసుపు బోర్డు ఏర్పాటును ప్రకటించింది. దీంతో ప్రస్తుత సంవత్సరం పంటకు మద్దతు ధర దక్కుతుందని రైతులు ఆశిస్తున్నారు. ప్రస్తుత పెరిగిన ఎరువుల ధరలకు అనుగుణంగా మద్దతు ధరను పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

పెట్టుబడి అధికం..

పసుపు అధిక పెట్టుబడి పెట్టి సాగు చేసే పంట. అంతే కాకుండ దీర్ఘకాలిక పంట కావడంతో రైతులకు పెట్టుబడి అధికమవుతుంది. ఎకరానికి రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు ఖర్చు అవుతుంది. ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారం మంచి దిగుబడి వస్తే పెట్టుబడి పెట్టినంత ఆదాయం మాత్రమే వస్తుంది. అదే ధర తగ్గిన, దిగుబడి తగ్గిన నష్టం ఎక్కువగా వస్తుంది. దీంతో పసుపు రైతులు పరేషనవుతున్నారు.

తవ్వకాలకు సిద్ధం

పసుపును జూన్ రెండో వారం నుంచి విత్తుతారు. డిసెంబర్ మధ్య నుంచి తవ్వకాలు చేపడుతారు. మరో 15 రోజుల్లో పసుపు పంటను తవ్వటకు రైతులు సన్నద్ధమవుతున్నారు. పసుపును తవ్వి ఉడికించి, కళ్లాలో ఆరబెట్టిన తర్వాత శుద్ధి చేసి మార్కెట్‌కు తరలిస్తారు. కనీసం క్వింటాలుకు రూ.12 వేలు ధర ఉన్న రైతుకు లాభాలు రాకున్న నష్టాలు రావంటున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మార్క్‌ఫెడ్ ద్వారా పసుపు కొనుగోలు చేసి క్వింటాలుకు రూ.17 వేలు చెల్లించారు. కానీ తర్వాత వచ్చిన పాలకులు పట్టించుకోకపోవడంతో పసుపు రైతులు నష్టపోతున్నారు.


రెంజర్లలో సాగవుతున్న పసుపు

మద్దతు ధర దక్కుతుందని ఆశిస్తున్నా



ఈ ఏడాది పసుపు పంటకు మద్దతు ధర దక్కుతుందని ఆశిస్తున్నాను. పసుపు బోర్డు ఏర్పాటుతో మార్కెట్‌లో పంటకు డిమాండ్ ఏర్పడుతుంది. ఫలితంగా ధర పెరుగుతుంది. అంతే కాకుండా నూతన వంగడాలు రైతులకు పరిచయం చేసే అవకాశం ఉంది. దీంతో దిగుబడి పెరుగుతుంది. క్వింటాళుకు 10 వేల పైన ఉంటే రైతులకు గిట్టుబాటు అవుతుంది. – పాలెం లింగారెడ్డి, రైతు

కలిసివచ్చిన ఏర్గట్ల సెంటిమెంట్

- ఏర్గట్లలో ప్రచారం చేస్తే సీఎం అవడం ఖాయమని నమ్మకం
- గతంలో సీఎంలైన ఎన్టీఆర్, వైఎస్ఆర్
- ఇప్పుడు రేవంత్‌రెడ్డికి కలిసివచ్చిందంటున్న నాయకులు


పాదయాత్రలో భాగంగా ఏర్గట్లలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి(ఫైల్)


రేవంత్‌రెడ్డి సీఎం కావాలని ఏర్గట్లలోని చెట్టుకు ముడుపుకట్టిన కాంగ్రెస్ నాయకులు

మోర్తాడ్: ఎన్నికల్లో సెంటిమెంట్‌లకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందని మరోసారి నిరూపితమైంది! ఏర్గట్ల బస్టాండ్ వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహించిన వారిలో ఇది వరకు ఎన్టీ రామారావు, డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంలు అయ్యారని ఈ ప్రాంత ప్రజల నమ్మకం. తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్‌రెడ్డి కూడా ఏర్గట్ల వేదిక ద్వారా ప్రచారం నిర్వహించడంతో ఆ సెంటిమెంట్ ఆయనకు కలిసి వచ్చిందని కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు చేసుకుంటున్నాయి. గడిచిన మార్చిలో నిర్వహించిన పాదయాత్రలో భాగంగా టీపీసీసీ అధ్యక్షుని హోదాలో రేవంత్‌రెడ్డి ఏర్గట్ల బస్టాండ్ వద్ద నిర్వహించిన సభలో మాట్లాడారు. 1982లో టీడీపీని స్థాపించిన తరువాత ఎన్టీఆర్ ప్రచారంలో భాగంగా ఏర్గట్లకు వచ్చి వెళ్లారు. 1983 లో టీడీపీ ఘనవిజయం సాధించడంతో ఆయన సీఎం అయ్యారు. 2004లో బస్సుయాత్రలో భాగంగా డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఏర్గట్ల బస్టాండ్ వద్ద నిర్వహించిన సభలో మాట్లాడారు. ఆయన కూడా కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చి సీఎం అయ్యారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి ఏర్గట్ల సభలో మాట్లాడటం, ఇటీవల ముగిసిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పూర్తి స్థాయి మెజార్టీ సాధించడం, రేవంత్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం విదితమే. ఏర్గట్ల బస్టాండ్ వద్ద ఇప్పటి వరకు ముగ్గురు నేతలు సభలను నిర్వహించి సీఎంలు గా ఎంపిక కావడంతో తమ గ్రామం అదృష్టం అని ఏర్గట్ల వాసులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా రేవంత్‌రెడ్డి సభ నిర్వహించిన సందర్భంలో బస్టాండ్ వద్ద ఉన్న ఒక చెట్టుకు తాము ముడుపు కట్టామని, ఆయన సీఎం కావడంతో ముడుపు విడిపిస్తామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. రేవంత్‌రెడ్డి సీఎం కావాలని ముడుపుకట్టినట్లు పార్టీ శ్రేణులు వెల్లడించాయి. ఏర్గట్ల సెంటిమెంట్ ఫలించడంతో సీఎం తమ గ్రామాన్ని, మండలాన్ని దత్తత తీసుకోవాలని డీసీసీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు సోమ దేవారెడ్డి కోరారు. ఈ మేరకు తాము సీఎంను కలిసి విన్నవిస్తామన్నారు.

సొసైటీలో వరి విత్తనాలు

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని సొసైటీలో యాసంగి పంట కోసం నాణ్యమైన వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చైర్మన్ నాలచ్ర్ బాలాజీ తెలిపారు. ఎంటీయూ 1010 రకం 25 కేజీల విత్తనాల బ్యాగు రూ.880 అలాగే కేఎన్ఎం 1638 రకం 25 కేజీల విత్తన బ్యాగు రూ.995 ధరతో విక్రయించనున్నట్లు తెలిపారు. అవసరమున్న రైతులు సొసైటీలో ఉన్న విత్తనాలు, ఎరువులు తీసుకెళ్లాలని కోరారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఎల్లారెడ్డి: కొత్తపల్లి గ్రామానికి చెందిన పిట్ల సాయిలుకు ఎస్సై గణేష్ గురువారం ఫోన్‌ను అందించారు. కొద్ది రోజుల క్రితం బాధితుడు సెల్‌ఫోన్‌ను పోగొట్టుకోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా బాధితుడి ఫోన్‌ను గుర్తించి అందించారు.

వికటిస్తున్న ‘మధ్యాహ్నం’!

- పాఠశాలల్లో భోజనం తిని అనారోగ్యం పాలవుతున్న విద్యార్థులు
- జిల్లాలో తరచూ ఘటనలు
- పట్టించుకోని అధికారులు

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వికటిస్తోంది.. బడిలో అన్నం తిన్నాక తరగతులు వినాల్సిన విద్యార్థులు.. అనారోగ్యానికి గురవుతున్నారు. జిల్లాలో తరచూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. సర్కార్ బడుల్లో అమలు చేసే మధ్యాహ్న భోజనంలో లోపాలతో ఈ ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. గురువారం నగర శివారులోని బోర్గాం(పి) ప్రాథమిక పాఠశాలలో 16 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. జిల్లాలో 1,742 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో రెండున్నర లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి ప్రతిరోజు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలి. కానీ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదు. కొన్ని పాఠశాలల్లో కుళ్లిన కూరగాయలు, పురుగులు పట్టిన బియ్యం, పప్పులతో వండుతున్నారు. ప్రస్తుతం నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో వంట ఏజెన్సీల నిర్వాహకులు నాసిరకం సరుకులతో వంట చేస్తున్నారు. అలాగే కొన్ని ఏజెన్సీలకు నెలల పాటు మధ్యాహ్న భోజన బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో కూడా నాణ్యమైన భోజనం అందించేందుకు ఇష్టపడడం లేదని సమాచారం. నిజామాబాద్ నగరంలో ఉన్న పాఠశాలల్లో దాదాపు 90శాతం బడుల్లో భోజన ఏజెన్సీలు ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వారివే. వీరు నాణ్యమైన భోజనాన్ని అందించడం లేదు. మాలపల్లి, ధర్మపురి హిల్స్, నాగారం ప్రాంతాలకు సంబంధించి ఒకే ఏజెన్సీ నిర్వాహకుడు వివిధ పేర్లతో మధ్యాహ్న భోజనం అందిస్తున్నాడు. ఒకే చోట భోజనాన్ని తయారుచేసి వివిధ పాఠశాలలకు సరఫరా చేస్తున్నాడు. ఇక్కడ గతంలో కూడా అనేకసార్లు మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులు ఆస్పత్రులు పాలయ్యారు.

చర్యలు కరువు

భోజనం ఏజెన్సీ నిర్వాహకులపై విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవడం లేదు. ఇటీవల భీమ్‌గల్ కేజీబీవీలో సుమారు 100 మంది విద్యార్థులు రాత్రి భోజనం తిని అస్వస్థతకు గురయ్యారు. విచారణ జరిపిన జిల్లా అధికారులు ఏ ఒక్కరిపై కూడా చర్యలు తీసుకోలేదు. రెంజల్ మండలంలోని మూడు పాఠశాలల విద్యార్థులు మధ్యాహ్న భోజనం సక్రమంగా లేదని రోడ్డెక్కి నిరసన తెలిపారు. సంబంధిత అధికారికి మెమో జారీ చేసిన విద్యాశాఖ మళ్లి స్పందించలేదు. మళ్లీ కొన్ని రోజులకే ఇక్కడ మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులు ఆస్పత్రుల పాలయ్యారు. ఇలాంటి ఘటనలు జరుగుతున్నా అధికారులు కఠిన చర్యలు తీసుకోవడం లేదు. పాఠశాలల్లో పర్యవేక్షణ లేక సానిటేషన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. వంట సామగ్రి నిల్వ చేసే గదులు, వంట గదులు శుభ్రంగా ఉండడం లేదు. తాగునీటి ట్యాంకుల వద్ద అపరిశుభ్రంగా ఉంటుంది. ఇలా అనేక కారణాలతో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

మృత్యువులోనూ వీడని స్నేహ బంధం

- దుబాయిలో ఇద్దరు కల్వరాల్ వాసుల మృతి

సదాశివనగర్: వారిద్దరు చిన్ననాటి మిత్రులు. ఎక్కడికెళ్లినా కలిసే వెళ్లేవారు. చదువుకున్నా.. ఆటలాడినా.. ఏ పనిచేసినా ఇద్దరు కలిసి చేసేవారు. కానీ విధి ఆడిన వింత నాటకంలో రోడ్డు ప్రమాద రూపంలో వారిని కబళించింది. మండలంలోని కల్వరాల్‌కు చెందిన అంగూరు ప్రశాంత్(25), గుర్రపు రవి(26) ఇద్దరు ప్రాణస్నేహితులు. ఆరేళ్ల క్రితం ఇరుకుటుంబాల ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో దుబాయికి వెళ్లారు. అక్కడే పనిచేస్తూ కుటుంబాలకు నగదు పంపించేవారు. ఈ నెల 3న దుబాయిలో నిర్వహించిన జాతీయ పండుగ రోజున స్నేహితుల వద్దకు వారు కారులో వెళ్లారు. దురదృష్టవశాత్తు వీరి కారు ప్రమాదానికి గురికావడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. గురువారం కల్వరాల్‌కు వారి మృతదేహాలు చేరుకున్నాయి. ప్రశాంత్‌కు తల్లిదండ్రులు లక్ష్మి, రాజు, రవికి గంగామణి, రాజులు ఉన్నారు. కుటుంబాలకు చెందిన ఇద్దరు పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.


ప్రశాంత్, రవి (ఫైల్)

రెండు ట్రాక్టర్లు ఢీ

- ఒకరికి తీవ్రగాయాలు

మాక్లూర్: రెండు ట్రాక్టర్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని మెట్‌పల్లి శివారులో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి శివారులో రెండు ట్రాక్టర్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో గొట్టిముక్కలకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ అశోక్‌కు కాలు విరిగిపోగా, ఇటుక బట్టీకి చెందిన మరో ట్రాక్టర్ డ్రైవర్ తలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే గాయపడ్డ వీరిని 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

ఫిట్స్‌తో గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని ఆర్యనగర్‌లో గుర్తు తెలియని వ్యక్తి (40) ఫిట్స్‌తో మృతి చెందినట్లు ఎస్సై సంజీవ్ గురువారం తెలిపారు. ఆర్యనగర్ రోడ్డు పక్కన ఓ వ్యక్తికి బుధవారం రాత్రి ఫిట్స్ రావడంతో 108లో ప్రభుత్వ ఆస్పత్రికి స్థానికులు తరలించారు. ఆస్పత్రికి వెళ్లే లోపు సదరు వ్యక్తి మృతి చెందినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 8712659840, 8712659719 నంబర్లను సంప్రదించాలన్నారు.

పెళ్లి కాలేదని మనస్తాపంతో..

నిజామాబాద్ రూరల్: పెళ్లి కావడం లేదనే మనస్తాపంతో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మల్లారంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన శ్రావణ్(31)కు పెళ్లి సంబంధాలు వచ్చినా ఏవీ కుదరకపోవడంతో మనస్తాపానికి గురై మల్లారం-గాంధీనగర్ గ్రామాల మధ్య పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.


శ్రావణ్ (ఫైల్)